క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగాల : మండలంలోని ముకుందాపురం, రేపాల ఏజీయల్, తాడువాయి, వెంకట్రాంపురం, మాధవరం, ఎస్ఎంపేట ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ వికాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అనంతగిరి మండలంలో..

అనంతగిరి : అనంతగిరి సబ్ స్టేషన్‌లో పరిధిలోని 11 కేవీ, అమీనాబాద్ ఫీడర్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున అమీనాబాద్, పాత గోల్‌తండా, కొత్త గోల్ తండా గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ సీతారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరేడుచర్ల పరిధిలో..

నేరేడుచర్ల : దిర్శించర్ల సబ్ స్టేషన్ పరిధిలోని 33/11కేవీ లైన్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించనున్నందున మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో పలు ఆదివారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్ఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ

కోదాడరూరల్ : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కోదాడ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ వడ్డే రాజేష్‌చౌదరి శనివారం తెలిపారు. కళాశాలకు చెందిన కొండా నాగమహేష్ జాతీయ స్థాయిలో 207వ ర్యాంకు, పోషం సాయి రవితేజ 1450 ర్యాంకుతో పాటు మరో ముగ్గురు 20వేల లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని గోవిందపురంలో అంబేద్కర్ లయన్స్ యూత్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో మొదటి బహుమతి బాలబోయిన వినోద్, పాలడుగు రాజు కైవసం చేసుకోగా ద్వితీయ బహుమతి బండి భాస్కర్, బాపనపల్లి వేణు గెలుపొందారు. విజేతలకు ఎస్ఐ చిలకబత్తిని ధనంజయ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు పి.ధనంజయ్, కోలా నాగేశ్వరరావు, సామరాజు, వీరబాబు, రాజు, శ్రావణ్, శ్రీనివాసు, వెంకటేశ్వర్లు, రాకేష్, మధు, గౌతమ్, జెట్టి ప్రసాద్, జయరాజు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

మునగాల : మండలంలోని కృష్ణానగర్‌లో శనివారం యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బేతం రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నూతలపాటి మధు, ఉపాధ్యక్షుడిగా గోవిందరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాంబాబుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కార్యదర్శిగా ఉదయభానురెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం మండల కేంద్రానికి చెందిన దేవరం శ్రీనివాసరెడ్డి– నిర్మల దంపతుల రెండవ కుమారుడు ఆకాష్‌రెడ్డి జ్ఞాపకార్థం అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. సీనియర్ జర్నలిస్టు జీఎస్‌రెడ్డి, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ, ఆశ్రమ వ్యవస్థాపకురాలు విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడి గుర్తింపు



రాము (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు మోతె మండలం కరక్కాయల గూడెం గ్రామానికి చెందిన దుశర్ల రాము (35)గా గుర్తించినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనరసయ్య శనివారం తెలిపారు. మృతుడు నేరేడుచర్ల మండల పరిధిలోని దిర్శంచర్ల గ్రామంలో తన బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా.. అప్పన్నపేట గ్రామ శివారులోని క్రషర్ మిల్లు వద్ద ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొనడంతో మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి దుశర్ల వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు 'భూభారతి'పై అవగాహన

కోదాడరూరల్ : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై సోమవారం కోదాడ పట్టణంలోని ఆర్ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వాజిద్‌అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

భవనం.. పదిహేనేళ్లకే శిథిలం

- పెచ్చులూడుతున్న కోదాడ తహసీల్దార్ కార్యాలయ భవనం పైకప్పు
- చువ్వలు తేలిన పిల్లర్లు, దెబ్బతిన్న పడమర వైపు స్లాబు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

కోదాడరూరల్ : కోదాడ తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, అధికారులు పనులను పర్యవేక్షించకపోవడంతో భవనం కట్టిన పదిహేనేళ్లకే శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం భవనం ఓ వైపు కూలేలా ఉంది. గత ఐదారేళ్ల క్రితమే భవనానికి పడమర వైపు ఉన్న గోడలకు నెర్రెలు బారాయి. ఓ గదితో పాటు సైడ్ బీములన్నీ పెచ్చులూడి పడుతున్నాయి. స్లాబ్ పిల్లర్ల పెచ్చులు కూడా ఊడిపోయి చువ్వలు బయటకు తేలాయి. దీంతో భవనంలో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏళ్ల కాలం నాటి భూ రికార్డులు, పత్రాలు ఉంటాయి. వర్షాకాలం వచ్చిందటే భవనం కురిసి అవి తడిసే ప్రమాదం కూడా ఉంది. మరో ఏడాది వరకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించకపోతే భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలే అవకాశం ఉంది. సాధారణంగా ప్రభుత్వ భవనాలు కనీసం 30 ఏళ్ల వరకు నాణ్యత ఉండే విధంగా నిర్మిస్తుంటారు. కానీ ఈ భవనం పదిహేనేళ్లకే శిథిలావస్థకు చేరింది.

2007లో ప్రారంభం..

అయితే కోదాడ పట్టణంతో పాటు నాటి ఉమ్మడి మండలంలోని 27 గ్రామాల ప్రజల అవసరాల నిమిత్తం గుడిబండకు చెందిన చింత చంద్రారెడ్డి స్థలాన్ని దానం చేశారు. ఆ స్థలంలో 2006లో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదిలో పనులు పూర్తిచేసి 2007లో నాటి హోంశాఖ మంత్రి కుందూరు జానారెడ్డి చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించారు.

మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం



తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం మరమ్మతు పనుల కోసం ఎస్టిమేట్ తయారు చేయించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– వాజిద్‌అలీ, తహసీల్దార్, కోదాడ

బిక్కుబిక్కుమంటూ విధులు

కోదాడ తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలమంది ప్రజలు వస్తుంటారు. కార్యాలయంలో ప్రజలు కూర్చున్న సమయంలో రెండు సార్లు భవనం పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. అదేవిధంగా పడమరవైపు ఉన్న రెండు గదులు కూడా శిథిలావస్థకు చేరడంతో అక్కడి సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.



పూర్తిగా దెబ్బతిన్న పడమరవైపు స్లాబు





పెచ్చులూడిన బీమ్‌లు, భవనం స్లాబు



చువ్వలు తేలిన పిల్లరు

నేరేడుచర్ల లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



గుండ్రెడ్డి సైదిరెడ్డి, అధ్యక్షుడు



యూసుఫ్, ప్రధాన కార్యదర్శి



నాగేశ్వర్‌రావు, కోశాధికారి

నేరేడుచర్ల : 2025– 2026 సంవత్సరానికి గాను నేరేడుచర్ల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండ్రెడ్డి సైదిరెడ్డి, ప్రధాన కార్యాదర్శిగా షేక్ యూసుఫ్, కోశాధికారిగా నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగా గుండా సత్యనారాయణ, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, కీత కనకయ్య, యారవ సురేష్, కన్వీనర్లుగా రాచకొండ శ్రీనివాస్‌రావు, చిలకరాజు శ్రీను, చిత్రం విశ్వనాథ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, బట్టు మధు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కొణతం కృష్ణారెడ్డి, క్రాంతికుమార్, యడవల్లి సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, విజయలక్ష్మి, కోటేశ్వర్‌రావు, శంకరాచారి తదితరులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న రేస్ కళాశాల చైర్మన్ బాణాల వసంత, సిబ్బంది

కోదాడరూరల్ : జేఈఈ మెయిన్స్ ఆల్ ఇండియా ఓపెన్ కెటగిరీ సెషన్– 2 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని రేస్ ఐఐటీ, మెడికల్ అకాడమీ చైర్మన్ బాణాల వసంతవెంకటర్‌రెడ్డి శనివారం తెలిపారు. కళాశాలకు చెందిన ఎస్‌డీ.హుజైఫ 3469వ ర్యాంకు, టి.రోహిత్‌రెడ్డి 4160వ ర్యాంకు, ఎస్.దీక్షిత 4635వ ర్యాంకు, పి.సూర్యప్రకాష్ 6253వ ర్యాంకు, సీహెచ్. కుషాల్‌సాయిస్వరూప్‌రెడ్డి 8241వ ర్యాంకులతో పాటు మరో ఏడుగురు విద్యార్థులు 20వేల లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన




హుజూర్‌నగర్ : అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి పశ్య సుబ్బరాంరెడ్డి

కోదాడరూరల్ : గ్యాస్ ఏజెన్సీలు అగ్నిప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కోదాడ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ముత్తినేని శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని శ్రీశ్రీ గ్యాస్ గోడౌన్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించి మాట్లాడారు. గోడౌన్ వద్ద బీడీ, సిగరేట్‌లు తాగవద్దని, మంటలు పెట్టకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పాడైన పైపులను మార్చాలని, గ్యాస్ వాడకం పూర్తయిన తర్వాత రెగ్యులేటర్ బంద్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది విజయ్‌కుమార్, ప్రకాష్, శ్రీనివాస్, వెంకన్న తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్ : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి పశ్య సుబ్బరాంరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం హుజూర్‌నగర్‌లోని క్యాంపు హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రవిబాబు, నగేష్, నరసింహారావు, రామారావు, అమృనాయక్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



లక్ష్మీనారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మునగాల : కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డిని శనివారం మునగాల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోదాడ పట్టణంలోని ఆయన నివాసంలో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోదాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి వీరబాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఉప్పుల జానకిరెడ్డి, ఓరుగంటి రవి, పనస విజయ్‌కుమార్, గంధం సైదులు, వేనేపల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మేడే వేడుకలను విజయవంతం చేయాలి

నేరేడుచర్ల : ప్రపంచ కార్మికుల దినోత్సవం (మేడే)ను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గురువయ్య కోరారు. శనివారం నేరేడుచర్లలో పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన అడ్డా కూలీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాయాలని చూస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ఇంజమూరి మల్లయ్య, సందీప్, కుర్రి వెంకన్న, శ్రీరాములు, మహేష్, వెంకటేష్, వేణు, జ్ఞానేష్‌బాబు తదితరులు ఉన్నారు.

వాడవాడలా మేడే జరుపుకోవాలి

నేరేడుచర్ల : ప్రపంచ కార్మికుల దినోత్సవం (మేడే)ను వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సరికొండ శ్రీను కోరారు. శనివారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నలో జరిగిన పార్టీ మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఎం నాయకులు అల్వాల శ్రీధర్, మామిడి నాగ సైదులు, మధుబాబు, సోమయ్య, అప్పారావు, సులోచనరాణి, ధనుంజయ, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

నడిగూడెం : సహకార సంఘం అందజేసే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాగితరామచంద్రాపురం పీఏసీఎస్ చైర్మన్ గోసుల రాజేష్ కోరారు. శనివారం కాగితరామచంద్రాపురం పీఏసీఎస్ కార్యాలయంలో సంఘం సభ్యుడైన మేకల గోవర్ధన్‌కు రూ.8 లక్షల దీర్ఘకాలిక రుణం చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్పర్సన్ నాగిరెడ్డి సంధ్య, సీఈఓ శ్రీనివాసరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య విడుదల చేశారు. ఓటర్ల జాబితాను బార్ అసోసియేషన్ నోటీస్ బోర్డుపై అంటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈనెల 21 ఉదయం 11 గంటల నుంచి 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఈనెల 23 ఉదయం 11: 30 నుంచి 1: 00 వరకు నామినేషన్ల పరిశీలన, అదేరోజు మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామని అదేరోజు మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు ఓట్ల కౌంటింగ్ తదుపరి విజేతల ప్రకటన ఉంటుందని వారు తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చిలుకూరు మండలం దూదియాతండా గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం 12 మందితో నూతన గ్రామ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా భూక్యా వసరాం, సహాయ కార్యదర్శిగా మోహన్‌రావు, సభ్యులుగా వీరభద్రరావు, ఎలమంద, నాగ, రమేష్, లక్ష్మణ్ నాయక్, నాగు, శ్రీను, స్వప్న, సుధా, తరంగిణి ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

హుజూర్‌నగర్‌రూరల్ : రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని లింగగిరి పీఏసీఎస్ చైర్మన్ కట్టా గోపాలరావు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చలమల రఘువయ్య, రామారావు, రైతులు ప్రసాద్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, వెంకన్న, విజయ్‌కుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గురుకుల పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నేరేడుచర్ల : మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు గాను ఆదివారం నిర్వహించే పరీక్షలకు ఏర్పాట్లను శనివారం పరీక్షా కేంద్రం సీఎస్ శ్రీనివాస్, డీఏ అనుకరణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేరేడుచర్ల మండలం గుడుగుంట్లపాలెం గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు చిల్లేపల్లి వద్ద ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మఠంపల్లి: మఠంపల్లి మండలం గుండ్లపల్లి వద్ద కృష్ణానది రేవులో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గుండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన సమాచారం మేరకు కృష్ణా నది రేవు ఒడ్డున సుమారు 40ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు మఠంపల్లి ఎస్ఐ పి.బాబు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఐసీడీఎస్ అధికారులు

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

చిలుకూరు : పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం చిలుకూరులో ఐసీడీఎస్ కోదాడ, హుజూర్‌నగర్ సెక్టార్ల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి బయట పడొచ్చని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహాం అందజేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను పంపిణీ చేశారు. అలాగే చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులకు ఘనంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ పీడీ నరసింహారావు, తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, ఎంఈఓ గురవయ్య, హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి, చివ్వెంల ఐసీడీఎస్ సీడీపీఓలు వెంకటలక్ష్మి, పారిజాతం, శ్రీజ, కిరణ్మయి, పోషణ అభియాన్ జిల్లా ఇన్‌చార్జ్ కిరణ్, సూపర్‌వైజర్లు సునిత, ఉపేంద్ర, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీమ్డ్ యూనివర్సిటీలో విలువలతో కూడిన విద్యాబోధన



మాట్లాడుతున్న డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్

మఠంపల్లి : చెన్నై నగరానికి 70 కిలోమీటర్ల దూరంలో శ్రీకంచికామకోటి పీఠం శంకరాచార్య స్వాములచే 30 ఏళ్ల క్రితం స్థాపించబడిన డీమ్డ్ యూనివర్సిటీ (శ్రీచంద్రశేఖర సరస్వతీ విశ్వ మహావిద్యాలయం)లో వ్యక్తిగత శ్రద్ధ, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యాబోధన జరుగుతోందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద గల ఎన్‌సీఎల్ జూనియర్ కళాశాలలో 2025– 26 సంవత్సరానికి గాను డీమ్డ్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్, ఆయుర్వేదం, మేనేజ్‌మెంట్ ఇతర యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా మెరిట్ స్కాలర్‌షిప్ విధానంలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకునే విధానం, ప్లేస్‌మెంట్ ఇతర అవకాశాల గురించి వివరించారు. డీమ్డ్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ నాగేశ్వరరావు, ఎన్‌సీఎల్ కంపెనీ హెచ్ఆర్ సతీష్‌కుమార్, మట్టపల్లి ఆలయ కమిటీ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, హనుమత్ ప్రసాద్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



మునగాల : బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు



హుజూర్‌నగర్ : బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుజూర్‌నగర్ : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు గొట్టే శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

మునగాల : మండలంలోని కొక్కిరేణిలో జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, రావులపెంట బ్రహ్మం, నిడిగొండ శంభ్య, వట్టెపు చినసైదులు, షేక్ అక్తర్ పాషా, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో ముందస్తు బడిబాట

గరిడేపల్లి : మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం మండల విద్యాధికారి చత్రునాయక్ ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్నకుమారి, బుచ్చిరెడ్డి, సాయిలు, సత్యనారాయణ, నాగేందర్, హుస్సేన్, వినీలరాణి, శోభన, ధనలక్ష్మి, కిషోర్‌బాబు, దీప్తి, సౌజన్య, ముత్యాలరావు, రాజారావు, వీరబాబు, ఉమ పాల్గొన్నారు.

రత్నవరంలో..

నడిగూడెం : మండలంలోని రత్నవరంలో శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.శారద, ఉపాధ్యాయులు ఎంవీచారి, నారాయణ, నరేంద్ర, రజిని, కృష్ణవేణి, సీఆర్‌పీ నందిగామ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో రన్ ఫర్ జీసస్ ర్యాలీ



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

హుజూర్‌నగర్ : గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌ను పురస్కరించుకొని హుజూర్‌నగర్ పట్టణంలో శనివారం క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్ద నుంచి పాత బస్టాండ్ వరకు సాగిన ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ జిల్లా, నియోజకవర్గ, మండలాల అధ్యక్షులు, ప్రతినిధులు నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

పలువురి అదృశ్యం.. కేసులు నమోదు



కందుల వెంకన్న



సపావట్ పున్నా

మఠంపల్లి: మఠంపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన టిప్పర్ డ్రైవర్ కందుల వెంకన్న ఈ నెల 15వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. వెంకన్న కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, అతడి భార్య నాగలక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.బాబు తెలిపారు.

మంచ్యాతండా యువకుడు..

మఠంపల్లి మండలం మంచ్యాతండాకు చెందిన సపావత్ శ్రీను కుమారుడు పున్నా ఈ నెల 5వ తేదీ నుంచి కనిపించట్లేదు. శ్రీను కుటుంబంతో సహా హైదరాబాద్‌లో కూలీ పనిచేసుకుని జీవిస్తున్నారు. గత నెల ఉగాది పండుగకు స్వగ్రామానికి వచ్చారు. ఈ నెల 4న హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. శ్రీను కుమారుడు పున్నా మరుసటి రోజు హైదరాబాద్‌కు వస్తాను అని చెప్పడంతో అతడిని వదిలి వెళ్లిపోయారు. అయితే పున్నా హైదరాబాద్‌కు తిరిగి వెళ్లకపోవడంతో పాటు మంచ్యాతండాలోనూ లేకపోవడంతో అదృశ్యమైనట్లు భావించి అతడి తాత సపావట్ తారాసింగ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లీకుమారుడు..



కుమారుడితో రమ్య

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలో తల్లీకుమారుడు అదృశ్యమయ్యారు. శనివారం ఏఎస్ఐ బలరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన పిట్టల గోపి భార్య రమ్య శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని చెప్పి తన 18 నెలల కుమారుడు నవీన్ కుమార్‌ను తీసుకుని వెళ్లింది. శనివారం వరకు కూడా ఆమె తిరిగి ఇంటికి రాకపోవడం, ఆచూకీ లభించకపోవడంతో పిట్టల గోపి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.